క్లుప్తంగా

రామలింగేశ్వర స్వామికి వెండి జటాజూటం సమర్పణ



రామలింగేశ్వర స్వామికి వెండి జటాజూటం అందిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్ : దిరుసుమర్రు గ్రామంలో కొలువైయున్న శ్రీ గంగా భ్రమరాంబ రామలింగేశ్వర స్వామి వారికి సోమవారం పెన్మెత్స కృష్ణంరాజు (పీకేఆర్) నూతన వెండి జటాజూటం బహూకరించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి పెన్మెత్స కృష్ణంరాజుకు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లూరి బంగార్రాజు, కలిదిండి పేర్రాజు, మైగాపుల గంగారామ్, యాళ్ల బాబులు, నక్కా రామోజీ రావు, చిట్లూరి శ్రీనివాస్, నక్కా పండు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం ఎంఈవోగా వేంద్ర వెంకటేశ్వరరావు

భీమవరం అర్బన్ : భీమవరం మండల విద్యాశాఖాధికారిగా సోమవారం వేంద్ర వెంకటేశ్వర రావు పదవీ బాధ్యతలు చేపట్టారు. పాలకోడేరు మండలంలోని కుముదవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు వీరవాసరం మండల విద్యాశాఖాధికారి బి.వినాయకులు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించారు. నూతన ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావును ఉపాధ్యాయ సంఘ నాయకులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

సాక్షి, భీమవరం : అంగన్‌వాడీ ఉద్యోగులకు జీతం పెంచుతామన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయడంతోపాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాడ్యుటీ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె జాన్సీ డిమాండ్ చేశారు. సోమవారం భీమవరం యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ డిమాండ్ల సాధన కోసం జూలై 10వ తేదిన 36 గంటలపాటు జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎండీ హసీనా, ఉపాధ్యక్షురాలు వైట్ల రాణి, మహాలక్ష్మి, శ్యామల, ఉమాదేవి, సత్యవతి, విజయలక్ష్మి, సత్యవాణి, దుర్గ, దీన, ప్రభ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ మల్టిపుల్ అవార్డు సాధించిన ఆకివీడు క్లబ్

ఆకివీడు: లయన్స్ మల్టిపుల్ ప్రోత్సాహక ఉత్తమ అవార్డును ఆకివీడు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పిన్నమరాజు మురళీ కృష్ణంరాజు కైవశం చేసుకున్నారు. ఈ నెల 18వ తేదీన నిడదవోలులో జరిగిన 316జీ సమావేశంలో జిల్లా అవార్డులను ప్రకటించగా ఆకివీడు క్లబ్‌కు 12 అవార్డులు వచ్చినట్లు సోమవారం స్థానిక విలేకర్లకు చెప్పారు. ఉత్తమ రూరల్ క్లబ్, ఉత్తమ జోన్ చైర్మన్‌గా గుర్రం శ్రీనివాసరావు, రెండవ ఉత్తమ కార్యదర్శిగా నెల్లి సతీష్‌కుమార్, ఉత్తమ కెరీర్ గైడెన్స్, ఉత్తమ పర్మినెంట్ ప్రాజెక్టు గోల్డెన్‌జుబ్లీ పైలాన్, లయన్స్ భవనం , అంతర్జాతీయ సభ్యుల చేరిక, కొత్త క్లబ్‌ల స్పాన్సర్ అవార్డు, ఎంజేఎఫ్ ధ్రువపత్రం, ప్రత్యేక ప్రోత్సాహక అవార్డులను డాక్టర్ ఎంవీఎస్.రాజు, ఆర్వీఎస్.సూర్యనారాయణరాజు, మోటుపలిల సతీష్, పీవీ.మురళీకృష్ణంరాజులకు అవార్డులు వచ్చినట్లు వివరించారు.

నేడు వలంటీర్లకు ఇంటర్వ్యూలు

పాలకోడేరు: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీ అయిన వలంటీర్ పోస్టులను భర్తీ చేసేందుకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నూకల మురళి గంగాధర రావు తెలిపారు. మండలంలోని గొరగనమూడి సచివాలయం, మోగల్లు సచివాలయం 2 పరిధిలో ఒకొక్క పోస్టు చొప్పున ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో గొరగనమూడి బిసి ఉమెన్, మోగల్లు ఓసి ఉమెన్ కేటాయించి దరఖాస్తులు ఆహ్వానించడం జరిగిందన్నారు. గొరగనమూడి వలంటీర్ పోస్టుకు ఇద్దరు, మోగల్లు పోస్టుకు 5గురు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించి 21వ తేదీన ఫలితాలు విడుదల చేసి ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తామన్నారు .

స్పందనలో 12 ఫిర్యాదులు

ఆకివీడు: మండలంలోని స్పందన కార్యక్రమంలో 12 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ కే.వాణి సోమవారం చెప్పారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత మండల అధికారులకు పరిష్కార నిమిత్తం బదలాయించడం జరిగిందని చెప్పారు. వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

వ్యాన్ ఢీకొని ఒకరికి గాయాలు

పాలకోడేరు: శృంగవృక్షం గ్రామానికి చెందిన అడబాల వీరవెంకట సత్యనారాయణ సోమవారం భీమవరం బైక్ పై వెళ్తుండగా విస్సాకోడేరు వద్ద వంకాయలపాలెం నుంచి రోడ్ పైకి వస్తున్న వ్యాన్ ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. భార్య దుర్గా భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- చినఅమిరంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్న టీడీపీ నాయకులు

భీమవరం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కాండ్రు ఏసోబు, తెనాలి దిలీప్ మరికొందరు సోమవారం వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వైఎస్సార్ సీపీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాష్ట్రాభివృద్ధి జరిగిందని, తిరిగి నేడు ఆయన



టీడీపీ నాయకులకు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

కుమారుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెద్దెత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ రాజకీయ నాయకుల పట్ల ప్రజల్లో విశ్వాసం నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. గత నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్ పాలనకు, గత చంద్రబాబు పాలనకు బేరీజు వేసుకుని ఇంకా టీడీపీలో ఉండాలా లేక అభివృద్ధికి కారకులైన వైఎస్సార్ సీపీ చేరాలా అని టీడీపీ నాయకులే ఆలోచించుకోవాలన్నారు. కుల, మత రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, మాజీ సర్పంచ్ గొట్టుముక్కల సత్యనారాయణ రాజు (ధర్మరాజు), గొట్టుముక్కల పద్మరాజు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

కాళ్ల: నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలకు సైతం స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. కాళ్ల మండలం కోలనపల్లి గ్రామంలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.21.85 లక్షలతో చేపట్టబోయే 8 మీటర్ల వెడల్పు గల ఎస్ఎస్ ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి, 250 మీటర్ల మేర నిర్మించబోయే పైపులైన్ విస్తరణ పనులకు ఆయన సోమవారం భూమి పూజ చేశారు. పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామల్లో వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. కోలనపల్లి గ్రామంలో పైపులైన్ విస్తరణ పనులు చేపట్టనున్నట్లు ఆయన స్పష్టం



కోలనపల్లిలో పైపులైన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

చేశారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ప్రతి గ్రామంలో ప్రజలంతా అండగా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, వేగేశ్న నాగరాజు, శ్రీనివాసరాజు, రాజ్యంరాజు, ఏసురాజు, యేసు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం

ఉండి: గత ప్రభుత్వం కన్నా నియోజకవర్గంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేసారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. సోమవారం ఉండిలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, కాలువ రేవులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రం ఉండిలో రూ.12 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు ప్రారంభించడం జరిగిందన్నారు.అభివృద్ధిలో ఉండి నియోజకవర్గం దూసుకుపోతుందని తెలిపారు.గత ప్రభుత్వాలు కొబ్బరికాయలు కొట్టి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్నాయన్నారు. కానీ ఇప్పుడు ప్రజలకు ఎక్కడ ఇబ్బంది ఉంటే అక్కడ వైఎస్సార్‌సీపీ నాయకులు ఉంటున్నారని దానిని పరిష్కరిచేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమతం సౌజన్య, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, జడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, రాష్ట్ర డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కరిమెరక చంద్రరావు, రణస్తుల మహంకాళి, కమతం బెనర్జీ,బడుగు బాలాజీ, బ్యాంక్ డైరెక్టర్ కరిమెరక శివనాగరాజు, కరిమెరక శివనాగరాజు,బొచ్చా అచ్చారావు, అంగర రాంబాబు, శేషాద్రి శ్రీను, ఆర్‌కే తదితరులు పాల్గొన్నారు.



ఉండిలో సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సాక్షి, భీమవరం : విద్యుత్ అధిక బిల్లులతో సామాన్యులపై పెనుభారం మోపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని, వాటిని తిప్పుకొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ పిలుపునిచ్చారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన వామపక్షాల నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజల కళ్లుగప్పి దొడ్డిదారిన విద్యుత్ చార్జీలు పెంచారని రానున్న స్మార్ట్ మీటర్లతో ప్రజలపై మరింత భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న విద్యుత్ చార్జీలు ఉపసంహరించాలని, విద్యుత్ కోతలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న వామపక్షాల ఆధ్వర్యంలో సదస్సు, 26న స్థానిక ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 30న విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళన చేపడుతున్నట్లు



వామపక్షాల నాయకుల సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

వివరించారు. సీపీఎం భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా నాయకుడు దండు శ్రీనివాసరాజు, సీపీఐ నాయకులు చెల్లబోయిన రంగారావు. ఎం.సీతారాం ప్రసాద్, సీపీఎం నాయకులు ఎం.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు సత్కారం

సాక్షి, భీమవరం : పట్టణంలోని పొట్టిశ్రీరాములు మునిసిపల్(పీఎస్‌ఎం) గరల్స్ హైస్కూల్లో సోమవారం పాఠశాల స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో 10వ తరగతి విద్యనభ్యసించి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన కె కీర్తి, టి.గీతిక, ఎ.నందినిలకు నగదు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీవైఈవో డి.శ్రీరామ్, పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ తోట జాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకుడు రంగబాబు మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా మిగిలిన విద్యార్థులు పట్టుదలతో చదివి ఎక్కువ మార్కులు సాధించడానికి కృషిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం జె సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం : స్థానిక ఎమ్మార్కె జిల్లా పరిషత్ హైస్కూల్లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం సోమవారం న్విరహించారు. 10వ తరగతిలో



భీమవరం : పీఎస్‌ఎమ్ గరల్స్ హైస్కూల్ విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

టాపర్లుగా నిలిచిన చెలపాటి మాధురి, చిగురుపాటి లలిత హెప్సిబా, కాకి యజ్ఞశ్రీలను సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చికిలే మంగతాయారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల శ్రేయస్సుకు అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. పాఠశాలలను నవీకరిస్తూ కార్పొరేట్ పాఠశాలలకు మించిన



వీరవాసరం : విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

సౌకర్యాలను కల్పిస్తున్నారని అన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకుని మంచి పేరు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ చుండూరి ముసలయ్య, ఎంపీటీసీలు వీరవల్లి కనక ఉషారాణి, ఊట జ్యోత్స్న, మేడే ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనలకు ఒంటరిగా పోటీచేసే దమ్ము లేదు

సాక్షి, భీమవరం : ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసే దమ్ము, ధైర్యంలేని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ముఖ్యమంత్రి ఎలా అవుతారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ప్రశ్నించారు. సోమవారం భీమవరం పట్టణం లంకపేటలో జరిగిన మాలమహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నిర్వహిస్తున్న వారాహి యాత్రలో ముఖ్యమంత్రిని అవుతానంటూ పవన్‌కల్యాణ్ కొత్తపల్లవి అందుకున్నారని టీడీపీ, బీజేపీలతో పొత్తుల కోసం పాకులాడితే అదే ఎలా సాధ్యమన్నారు. టీడీపీ జాతీయకార్యదర్శి నారా లోకేష్ టీడీపీ అధికారంలోనికి వస్తే వైఎస్సార్‌సీపీ నాయకులను జైలులో పెడతామంటు మాట్లాడుతున్నాడని ఇప్పుడు అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ టీడీపీ నాయకులను జైలులో పెట్టించలేదా అన్నారు. దమ్ముంటే పవన్‌కల్యాణ్, లోకేష్ ఒంటరిగా పోటీచేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన పార్టీలు ఎన్నికుట్రలు చేసినా రాబోయే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలంతా వైఎస్సార్‌సీపీనే గెలిపిస్తారని మంగరాజు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సునీల్, ఏసురత్నం, దాస్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాలమహానాడు సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

టీడీపీ వైఖరిని తప్పుబట్టిన రజక సంఘం

సాక్షి, భీమవరం : తెలుగుదేశంపార్టీ నిర్వహించే పార్టీ రజక సంఘం సమావేశ ఆహ్వానపత్రికలో తమ అనుమతి లేకుండా పేర్లు వేయడాన్ని రజక సంఘం నాయకులు తప్పుబట్టారు. సోమవారం భీమవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో రజక కార్పోరేషన్ జిల్లా డైరెక్టర్ రేవూరి గోగురాజు, భీమవరం పట్టణ రజక సంఘం అధ్యక్షుడు, ఏబీడీఏమ్ జాతీయ ఉపాధ్యక్షుడు చింతాడ శ్రీనివాస్, జిల్లా రజక సంఘం గౌరవ సలహాదారుడు చంద్రిక మూర్తి, జామి రమేష్, ఆదిత్య బాబీ మాట్లాడారు. రజకుల సంఘం రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పార్టీలకు అతీతంగా వృత్తిదారులంతా ఒకే తాటిపై సోదర భావంతో రజకుల సమస్యల పరిష్కార దిశగా పని చేస్తున్నామన్నారు. అయితే టీడీపీ రాజకీయ రజక సమావేశాలు ఏర్పాటు చేస్తూ తమ ప్రమేయం లేకుండా ఆహ్వానపత్రాల్లో తమ పేర్లు వేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రజక వృత్తిదారులకు ప్రత్యేక గుర్తింపునిచ్చి సమస్యల పరిష్కార దిశగా పనిచేస్తున్నారని కొనియాడారు. భీమవరం నియోకవర్గంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రజకులకు అండదండగా నిలబడ్డారని చెప్పారు. రజకుల సమస్యల పరిష్కార దిశగా తాము పనిచేస్తుంటే తమ ప్రమేయం లేకుండా పేర్లు వేయడం దారుణమని ఇటువంటి ఘటనల కారణంగా రజకులు ఐక్యమత్యాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా చూడాలని కోరారు.



విలేకర్లతో మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

వ్యక్తిపై కేసు నమోదు

పాలకోడేరు: భవనం నిర్మించుకుంటే నోటీసు ఎందుకు ఇస్తున్నారు అంటూ తన విధులకు ఆటంకం కలిగించిన గొల్లలకొడేరు పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి సీహెచ్ రమాలీల అదే గ్రామానికి చెందిన మెరుగుబోయిన వెంకటేశ్వరరావుపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

11 మంది జూదరుల అరెస్ట్

భీమవరం అర్బన్ : భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఎస్సై బి.మోహన్‌రావు తన సిబ్బందితో దెయ్యాలతిప్ప గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేశారు. 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 12,180, 16 సెల్‌ఫోన్లు, ఒక మోటార్‌సైకిలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

పాలకోడేరు: తాడేపల్లిగూడెంకు చెందిన గల్ఫ్ ఏజెంట్ బత్తిన సంజీవరావు (53) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. భీమవరంలో పని చూసుకొని పాలకోడేరు గరువు చెందిన సీహెచ్ ఆసాద్యుడు ఇంటికి పాస్పోర్టు పని మీద వచ్చిన పిదప ఛాతిలో నొప్పి వస్తుందని సేద తీరిన కొద్దీ సేపటికి మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్‌లు, జూలై 3న సీట్ల కేటాయింపులు జరుగుతాయని వివరించారు.

పేదల పాలిట వరం ఫ్యామిలీ డాక్టర్

- ఇంటి ముంగిటకు ఉచిత వైద్య పరీక్షలు, సేవలు
- ప్రజల హర్షాతిరేకాలు

పాలకోడేరు: ఫ్యామిలీ డాక్టర్ పథకం పేద, మధ్యతరగతి ప్రజల పాలిట వరంగా మారింది. రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆర్థికాభివృద్ధికి సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం ప్రధానం అని గుర్తించింది. ఆ మేరకు నాడు–నేడు పథకం ద్వారా ఆయా రంగాలను బలోపేతం చేసింది. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్, కార్పొరేట్ తరహాల్లో అభివృద్ధి చేసింది. విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించింది. ఇక వైద్య రంగం విషయాని కొస్తే ప్రజల చెంతకే వైద్య సేవలను తీసుకెళ్లింది. దానిలో భాగంగా గతేడాది అక్టోబర్ 22నుంచి ట్రయల్‌రన్ చేపట్టిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్-ఫ్యామిలీ షిజీషియన్ పథకాన్ని గత నెల 6నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఈ పథకంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



పాలకోడేరులో రోగులను పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ రంగమ నాయుడు

గతంలో ఏరోగమొచ్చినా పట్టణాలకే పరుగులు...

గతంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఏ చిన్న రోగమొచ్చినా, ఏ పెద్ద జబ్బు చేసిన ప్రాణాలు అరచేత పెట్టుకొని పట్టణాలకు పరుగు పెట్టేవారు. దీర్ఘకాలిక రోగులు, ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు చేయించుకున్నవారు, గర్భిణులు, బాలింతలు కూడా పరీక్షలు నిమిత్తం పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. పేద ప్రజలు వైద్య చేయించుకోలేక, మందులు కొనలేక ప్రణాల మీదకు తెచ్చుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వమే ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా వైద్యులను, సిబ్బందిని గ్రామాలకు పంపించి వైద్య పరీక్షలు చేయిస్తోంది. మందులను ఇస్తుంది. మండలానికి ఒక 104 వైద్య సేవల వాహనం ఉండగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్-ఫ్యామిలీ ఫిజీషియన్ పథకంతో మరో వాహనాన్ని ప్రభుత్వం సమకూర్చింది. ప్రత్యేక వైద్య సిబ్బందిని నియమించింది. ఆ బృందం ప్రతి సచివాలంయ పరిధికి నెలకు 2సార్లు వెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకూ వైద్య సేవలు అందిస్తారు. ముఖ్యంగా 104లో ఈసీజీ, గర్భిణులకు పీటల్‌హార్ట్, రేట్ మానిటర్, హెచ్‌బీ వంటి టెస్టులు 14 రకాల టెస్టులు, 90రకాల మందులు ఇస్తున్నారు.

పేదవారిని ఆదుకోవడం సంతోషంగా ఉంది



ఫ్యామిలీ ఫిజీషియన్ పథకంతో పేదవారిని ఆదుకోవడం సంతోషంగా ఉంది. గతంలో పటన్ణంలో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి మందులు తెచ్చుకునే దాన్ని. ప్రస్తుతం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామంలోనే మందులు ఉచితంగా ఇస్తున్నారు. ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగనన్న వచ్చాక మాలాంటి వారికి మేలు చేస్తున్నారు. మాకు ఖర్చులు ఇబ్బందులు తప్పాయి. మాలాంటి పేదవాళ్లని ఆదుకోవడం సంతోషంగా ఉంది. **రామగని ఆంధ్రావతి మోగల్లు**

ప్రభుత్వం మేలు మరువలేను



గతంలో ఏ చిన్న వ్యాధికి గురైనా భీమవరం, తణుకు వంటి దూర ప్రాంతాల్లో ఆస్పత్రులకు ఎన్నో వ్యయ ప్రయాసలతో వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు సీఎం జగన్ ప్రభుత్వం పుణ్యమా అని ఆబాధ లేకుండా వైద్యులతో సహా సిబ్బంది మా ఇంటి దగ్గరకే వచ్చి వైద్య సేవలందిస్తున్నారు. మందులిస్తున్నారు. గ్రామానికి ఇంటికి వైద్యులు వస్తున్న ఈ పథకం చాలా మంచిది.

గుత్తుల రాముడు, గుత్తులు వారి పాలెం

ప్రభుత్వ లక్ష్యం మేరకు...



ప్రభుత్వ లక్ష్యం మేరకు గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం . షెడ్యూల్ ప్రకారం గ్రామ సచివాలయాల పరిధిలో సిబ్బందితో వెళ్లి ఓపీ నిర్వహిస్తున్నాం. వివిధ పరీక్షలతో పాటు అన్ని రకాల రోగులకు వైద్య సేవలందిస్తున్నాం. ప్రభుత్వం అన్ని రకాల మందులు సరఫరా చేయగా పెషెంట్లకు అవసరమైన మందులు అందజేస్తున్నాం. ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తుల ఆరోగ్యం పాలోఆఫ్ చేస్తున్నాం.

– చినమిల్లి రంగమనాయుడు, పీహెచ్‌సీ వైద్యాధికారి